

# మాయింటి దీపం

యర్రంశెట్టి సాయి

ఇది నా కోడలు.

చెప్పుకుంటే సిగ్గుచేటు. అయినా ఇది నా కోడలే! నేనే కావాలనికోరి నా కొడుక్కి చేసుకొన్న సుగుణాలరాశి. అంచేత ఇప్పుడు నా మీదే ఎక్కి స్వారి చేస్తోంది. గంగిరెద్దుని ఆడించినట్లు ఆడిస్తోంది. పోనీలేగదా చిన్న తనమని సర్దుకుపోతూంటే మరీ హద్దు మీరి పోతోంది. అసలు నన్ను లెక్క చెయ్యడమే మానేసింది. ఎందుకూ పనికిరాని ఓ ముసల్దా

నిగా చూస్తోంది చూస్తుంది, చూడకేం చేస్తుంది? ఖచ్చితంగా చూస్తుంది దానికి నేనిచ్చిన అలుసలాంటది చెంపలు పగిలేట్లు కొట్టుకొని చేసినప్పుడు పశ్చాత్తాప పడితే మాత్రం ఏం లాభం? ఏమీ లాభం లేదు పీనం యెత్తుకూడా లాభం లేదు అబ్బో అదేమంటే నా భూమ్మీద ఆగేట్లుందా? ఇల్లంతా తనదిగా చేసుకొని ఏలేస్తోంది వాడో పిచ్చి వెధవ అంట్ల వెధవలా తయారయ్యాడు పెళ్ళయిన పావుగంటకే పెళ్ళానికి దాసోహమనేశాడు దాన్చేతులో కీలుబొమ్మయి పోయాడు పిల్లల చేతిలో దసరా ఆంజనేయులు బొమ్మలాగా ఆదెటు లాగితే అటు ఎగురుతున్నాడు అంతే! అవునుమరి! ఇన్నాళ్ళూ పెంచి పెద్ద చేసింది వీడ్నిలా పెళ్ళానికి ధారాదత్తం చేసేయడానికే ఈ తల్లులందరికీ తెలిస్తా వదు తెలీక "నా కొడుకో!" అంటూ ప్రాణమిస్తారు ఎప్పటికయినా తమల్ని చూసేది వాడేనని నెత్తినెట్టు కొంటారు ఈ వెధవాయిలేమో పెళ్ళాం రాగానే దాని కొంగునే మూలో దాక్కొని తల్లి నెత్తి కొడతానికి వస్తారు వస్తారేమిటి? మొన్న నాలుగో ఇంటి సీతాపతిగాడు రానే వచ్చాడు అక్షరాలా తల్లిని చావబాదాడు బాదాలి కూడానూ! అప్పుడుగాని ఈ తల్లికి బుద్ధిరాదు లేపోతే ఏమిటి? కొడుకుని ఓ మహారాజులానూ, కూతుళ్ళను తమ సంసారం గుల్లచేసి పారేసే సాధనాలుగా చూసి, వాడి ముందు వీళ్ళను దాసీ వాళ్ళల్లా పెంచి-ఎందుకు పెద్ద చేయాలి? అంచేత వాళ్ళకూ బుద్ధి చెప్పాల్సిందే! అలాంటి తల్లులని ఆ ముద్దు కొడుకులు పాతేసినా జాలి తలువ కూడదు ఇలాంటి గుణపాఠాలెన్నో జరిగితేగాని ఈ తల్లి జాతి మారదు ఆ కోడలు పిల్లమాత్రం? పెళ్ళి చూపుల కెళ్ళినపుడు ఎంత వినయ విధేయతలు నటించిందనీ? బాబోయ్! తల్చుకొంటే గుండెలు పగిలిపోతున్నాయి ఏమయినా—సంబంధం ఉంటూ? అప్పటికీ ఇప్పటికీ, బరితెగించి పోయింది! ఇక దాన్నెవ్వడూ అదుపులో పెట్టలేడు అదు పులో ఉంచాల్సినోడే దాని గుప్పిట్లో చీమలా తిరుగుతున్నాడు ఇంకా ఎవరెన్ని చెప్తే, చేస్తే మాత్రం ఏం లాభం?

పెళ్ళయి కాపరానికొచ్చిన ఓ నెల్లో జులు సరిగ్గా ఉందేమో! నేను చెప్పినట్లు వింది చెయ్య మన్నట్లు చేసింది నాతో మల్లెపూల జడ వేయించుకొనేది పైట నిండుగా కప్పుకొనేది బాడీ వేసుకొనేది కాళ్ళకు పసుపు రాసుకొనేది ప్రొద్దున్నే అయిదింటికి నిద్ర లేచేది అన్నిటికీ నా సలహా అడిగేది ఏం కావాలన్నా నన్న డగందే కొనేదికాదు మా వగారంటే భయమూ భక్తీ ఉండేది ఆయనెదుటనే వెళ్ళేది కాదు పరాయి మొగాళ్ళతో అసలు మాట్లాడేది కాదు అందాకా ఎందుకూ? మావగారికి మందిమ్మంటేనే "ఆయనెదు టకి వెళడానికి సిగ్గు బాబోయ్," అంటూ సిగ్గు పడేది వీధిలోకి తొంగి కూడా

చూసేద కాదు  పొరుగిళ్ళకు వెళ్ళేదే కాదు వాడు! ఆ అంట్ల వెధవ మాత్రం? ఎట్లా ఉండేవాడని? చిన్నప్పటినుంచి ఒక్క రోజయినా నన్నొదిలి ఉన్నాడా? నేను ప్రక్కన లేందే భోజనం చేశేడా? నేను జోకొట్టందే నిద్ర పోయేవాడా? చిల్లర డబ్బులు కావల్సొచ్చినప్పుడల్లా నన్నడిగి తీసుకోలే? ఏ కొంచెం తలనొప్పి వచ్చినా 'అమ్మా' అంటూ నాతో అమృతాంజనం రాయించుకోలే? రాత్రిళ్ళు పదింటి వరకూ వెన్నెల్లో నా ప్రక్కలో కూర్చొని కథలు చెప్పమని ప్రాణం తీయలే? అందాకా ఎందుకూ? వాడు థర్డ్‌ఫారం చదువుతోన్న పుడేమయింది? క్లాసు వాళ్ళందరూ పిక్‌నిక్‌కి పోతూంటే నేనూ పోతానని తయారయి తీరా ఆ రోజు వచ్చేసరికి మా అమ్మ లేందే నేను రానని ఏడ్చెయ్యలే? ఉద్యోగంలో చేరిన మొదట్లో జీతం అంతా తెచ్చి నా చేతుల్లో పొయ్యలే? అన్నీ చేశాడు అయినా అదొచ్చేసరికి ఊసరవెల్లిలా రంగు మార్చేశాడు, అయ్యో! మార్చటం కూడా ఎట్లా? అసలా రంగుకీ ఈ రంగుకీ సంబంధమేలేదు పూర్తిగా మరో జన్మ ఎత్తినట్లే మారిపోయాడు అధికాపరానికొచ్చిన మర్నాటి నుంచి ఆ గదిలో నుంచి బయటకు రావడమే మానేశాడు నాతో ఆదివారం మాట్లాడ్డవే మానేశాడు ఎప్పుడూ-దానితో మాటలే!ఎప్పుడూ ఇద్దరూ వికవికలూ - పకపకలే! నేనూ కాపరం చేశాను కాని ఏనాడూ ఇంత విరగబడి పోలేదు అదొచ్చిన రెండో రోజునే 'నేనూ శాంతా కలిపి భోజనం చేస్తాములే అమ్మా! ముందు మీరు తినెయ్యండి!'' అంటూ వడ్డించిన భోజనం చేయకుండానే గదిలో కెళ్ళిపోయాడు రాత్రి ఎప్పటికో ఇద్దరూ గంటసేపు కబురాడుతూ భోజనం చేశారు అది ప్రక్కనుంటే భోజనం అమృతమయి పోతుందా నేనుంటే విషమయి పోతుందా? కాఫీ మాత్రం? ఓ రోజు వంట్లో బాపుండక దానితో కాఫీ చేయించాను అంతే! ఆ రోజు నుంచీ ''నువ్వే కాఫీ కాస్తూండు? అద్భుతంగా ఉన్నది అంటాడా? అన్నేళ్ళుగానే చేస్తున్న కాఫీ ఎందుకూ పనికిరాని చూరు నీళ్ళల్లా అయిపోయినయ్యా? వాడే కాదు ఆయన? నాతో ఇన్నేళ్ళు కాపరం చేసిన ఆ ముసలాడు (వళ్ళు మండి పోతోంది మరి) కూడా కొడుక్కి వంత పాట పాడుతోండె! అది చేసిన కాఫీ అద్భుతంట! ఆ రోజు అది వండిన వంట అమోఘంట, అది నూరిన కంది పచ్చడి సూపర్బట ఎలా పొగిడారనీ? నే వింటున్నానని సిగ్గు లేకుండా నోటి కొచ్చినట్లు మెచ్చుకొంటున్నారు నే కాపరానికొచ్చిన క్రొత్తలో ఆ నోటితోనేగా నేనో దేవతననీ, నే చేసే వంట పంచామృతం అనీ, అందీ? అది మర్చేపోయారు ఇప్పుడేమో ప్రతిదానికీ కోడలు కావాలి? నిన్నగాక మొన్న వచ్చిన కోడలు బంగారవయి పోయింది, రోజూ నేను మందు ఇస్తే

అరగంట గొడవచేసి. ఒహోరోజు ఆగకుండానే ఊరుకొనే వాళ్ళు. ఇప్పుడేమో కోడలు పిల్ల తీసుకెళ్ళ స్తే కిక్కురు మనకుండా మింగుతున్నారు.

నెలొచ్చేసరికి పెన్షనంతా పేకాటలో తగలేసి వచ్చేవాళ్ళు, దమ్మిడీ అడిగినా ఇచ్చేవాళ్ళు కాదు. యిప్పుడేమో కుక్కిన పేనులా కోడల్చేతిలో పైసల్తో సహా అప్పజెప్తున్నారు. ఏం? నేనంటే అంత లెక్కలేనితనమా? ఆదంటే భయమూ. భక్తీనా? వాడూ అంతే! జీతం అంతా తెచ్చి దాన్చేతిలో పోసి దాసోహం అంటున్నాడు. ఏ రోజు ఖర్చుకి సిగ్గులేకుండా దాన్ని దేవురించి తీసుకెళ్ళాల్సిందే గదా. అదేమంటే నేను దుబారా మనిషి నట. తప్పు వాడ కట్టందరికీ అప్పులిచ్చి పంచేస్తున్నానంట! నాకేమీ తెలీదట. చేతకాదట. యిరవై ఆరేళ్ళు పెంచి పెద్దజేసినందుకు ఇవీ వీడు నాకు ప్రసాదించిన బిరుదులు ఓ రోజు తలొప్పి వచ్చిందని దాని వళ్ళో తల పెట్టుకు పడుకొన్నాడే గాని మాట మాత్రమయినా నాతో చెప్పడంలా అదేమో మొద్దులా తెల్లార్లూ ఊరుకొని ప్రొద్దున్న చెపుతోంది. సినిమాలేం తక్కువా? నెలొచ్చేసరికి రెండు సినిమాలకి ఊరేగుతున్నారు! సినిమా కెళ్ళాలనేసరికి అదెలా తయారవు తుందనీ? ఓ షోకా? ఫాషనా? అబ్బో! ఈ రోజు సినిమా కెళ్ళాలంటే వారం రోజులు ముందునుంచే తయారవడం మొదలెడుతుంది. నేవేసే మల్లెపూల జడ ఫాషన్ కాదట. రెండు జడలు వదులుగా వేసుకొనేది. ఆ జాకెట్టు? అవ్వ! సిగ్గుచేటు. నేను జూసి వీపంతా చిరిగి పోయిందేమో అనుకొన్నాను. అదే, పైకంటే ఎలా నవ్వేందని విరగబడి! కాదంట! ఫాషనంట! వెనుక సగంవీపు కనబడటం ఫాషనా? చీరేమో బొడ్డు క్రింది దాకా దిగలాగి కట్టింది. అదేమిటంటే అదంతేనట! ఆ అంట్ల వెధవ కూడా "అదంతేలే వే! నువ్వూరుకో!" అంటాడేమిటో? ఇదేమయినా భోగం కొంపా? మరేవిటా భోగం వేషాలూ? ఆ మాటంటే నామీదే విరుచుకు పడ్డాడు. అవతల అది చేసే పన్లు బాగానే వున్నాయి. నచ్చ జెప్పటం పాపమయి పోయింది. "యింకోసారి దాని విషయంలో నువ్వసలు జోక్యం కల్పించుకోకు, అదేం చిన్న పాపాయి కాదు. దాని మంచి చెడ్డలు దానికి తెలుసు!" అంటూ పోట్లాడినంత పని చేశాడు.

అదెంత టెక్కుల మారి అనీ! నాల్రోజులు కాస్తంత నలతగా ఉంటే అసలిక వంటింట్లోనే రావద్దంటూ వంట తనే చేయటం మొదలుపెట్టింది. అదేవిటంటే నేను రెస్ట్ తీసుకోవాలని డాక్టర్ చెప్పాడుట. ఈ వేషాలన్నీ ఇట్టే కనిపెడతాను. అసల్సంగతి నాకు తెలుసు. ఆది నామీద ప్రేమ కాదు, ఆ వెధవకి అది వండితేనే తినాలనుంది. పైకి చెప్పదు. నా ఆరోగ్యం మీద వంక. ఇవన్నీ—ఈ చేష్ట

లన్నీ చూస్తుంటే అసహ్యం కలుగుతోంది. రోత పుడుతోంది. ఈ యిల్లొదిలి ఎటేనా పోవాలనుంది పెద్ద కూతురు రమ్మని ఉత్తరాలు వ్రాస్తోనే ఉంది. వెళ్తే నెత్తిన బెట్టుకుంటుంది వెళ్తేసరి. లేపోతే ఏమిటి? గౌరవం లేని చోట నే ఎందుకుండాలి? సావిత్రమ్మ అందుగ్గాదూ—కూతురి దగ్గరి కెళ్ళిపోయింది? కొడుకేదో చిన్న మాట అన్నాడని రోషం వచ్చి బట్టల్సర్దుకొని వెళ్తున్నాననయినా చెప్పకుండా కూతుర్దగ్గ రికి చక్కా పోయింది. అంతే! మళ్లీ రాలేదు. తరువాత అతగాడెళ్ళి బ్రతిమాలినా రాను పొమ్మందిట, అయినా నా పిచ్చిగాని ప్రపంచంలోని కోడళ్ళంతా ఇలానే ఉంటారా? చివరింటి రాధమ్మ కోడలు చూడరాదూ? రోజూ ఆవిడ పనిమాలా వచ్చి తన కోడలు గురించి ఆనందంగా, గొప్పగా చెప్పి మురిసిపోతుంటుంది. ఆవిడ సలహా లేందే జడ కూడా వేసుకోదట. ఉదయాన్నే లేచి అత్తగారి కాళ్ళు కళ్ళ కద్దుకొని గానీ రెండో పని చేయదంట. రాత్రిళు అత్తగారు నిద్రపోయేవరకూ కాళ్ళు పట్టిగాని తను నిద్రపోదుట అత్త గారికి కాస్త నలతగా ఉంటే చాలు విల విల్లాడిపోయి కూడూ నీళ్ళూ లేకుండా దగ్గర కళ్ళల్లో వత్తులేసుక్కూచుని పరి చర్యలు చేస్తుందట. కొడుక్కీ కూడా తల్లంటే వల్లమాలిన భక్తి అట. పెళ్ళాంతో కొరడాతో కొట్టినట్లు మాట్లాడతాడట. తల్లి చెప్పిన పని చెయ్యకపోతే, పెళ్ళాన్ని కొడ తానికని ఓ కొరడా కొనుక్కొచ్చి హాల్లో గోడకు తగిలించి ఉంచాడట. ఈ మాట సావిత్రమ్మ చెప్తున్నపుడల్లా ఎంత ముచ్చ టగా, ఆనందంగా ఉంటుందని. అలాంటి కొరడా ప్రతి కొడుకూ కొనిపెడితే ఈ కోడలు పిల్లలు ఇలా ఎదురు తిరగ్గలరా? నువ్వెంతంటే నువ్వెంతని మాట్లాడ గలరా? ఇంతకూ రాధమ్మ అదృష్టవంతు రాలు. మొదట్నుంచీ తనెలాంటి కోడలు కావాలనుకొంటూ వచ్చిందో అలాంటి కోడలే దొరికింది. దేనికయినా పెట్టి పుట్టాలి. మాటల్లో రాధమ్మ వస్తూనే ఉంది.

"రావమ్మా రాధమ్మా! ఇది విన్నావా? ఇటు కూర్చో ముందు. మా కోడలు... ఆవిడని నేనాజ్ఞాపించగూడదట. ఆవిడ కిష్టమయిన పనులు చేసే అధికారం ఆవిడ కున్నదట నేనసలు జోక్యం కలుగజేసుకో కూడదట. కృష్ణా రామా అనుకొంటూ మూల కూర్చోవాలిట. అవునూ! నాకు తెలీకడుగుతాను, నలభై అయిదేళ్ళకే మనకి మతులు పోతయ్యా? మంచీ చెడ్డలు చూసే తెలివి లేకుండా పోతుందా? మన కంటె వీళ్ళకెక్కువ తెలుసా? వాడు నా కొడుకు సంగతి! ఖర్మ! చెప్పకుంటే సిగ్గుచేటు. వాడే ఇవన్నీ నాతో చెప్త! అ[illegible] లేనిపోనివి కల్పించి చెప్పకపోతే వాడె[illegible] దుకు నామీద ఎగిరి పడతాడు? వాడ్ని కొంగున ముడేసుకొని, అన్నీ నేర్పి న మీదే యుద్ధానికి పంపుతుందా? తప్పు దా[illegible] కాదమ్మా!" దాన్నేమీ అనను నేను. అం[illegible]

ఈ వెధవది. అందరు కొడుకులూ ఇలానే పెళ్ళాం వెనుక కుక్కలా తోకాడించు కొంటూ తిరుగుతున్నారా? కని పెంచిన తల్లినే చూపి 'ఛో' మంటాడూ? మీ అబ్బాయీ ఇలానే ఉన్నాడా? వాడుమాత్రం పెళ్ళి చేసుకోలేదూ? పెళ్ళాన్ని ఏలుకోటం లేదూ? మహారాజులా ఏలుకొంటున్నాడు అవునా? అయినా నెత్తినెక్కించుకోకుండా ఎట్లా ఉంచాలో అట్లా ఉంచాడు నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నాడు అవునా? ఎందుకమ్మా? కన్నీళెందుకూ? నా పరిస్థితి చూస్తే ఏడుపొస్తోందా? కాదా? మరెం దుకూ ఏడుపు? ఏమిటీ? నీ కొడుకు మంచాడు కాదా? కోడలు అలా కనబడు తుందిగాని రాక్షసా? కొరడా పెట్టి నిన్ను కొట్టబోయాడా? ఇద్దరూ కలిపి నినింట్లోంచి పొమ్మన్నారా? సాయంత్రం బండికి వెళ్ళి పోతున్నావా? అదేమిటి? మొన్నటివరకూ కోడలి గురించి మరలా చెప్పావేం? అన్నీ అబద్ధాలు చెప్పావ? మొదట్నుంచీ ఓ పనిమనిషిలా మాశారా? అంట్లు తోమించి, ఇళ్ళు ఊడిపించి, బట్టలు ఉతి కించి ,అయ్యో దేముడో! అవన్నీ కడుపులో ఉంచుకొని నా దగ్గర 'మా కోడలు బంగా రం, వెండి' అంటూ కబుర్లు చెప్పేవ్! బండికి టైమయిందా! వెళ్ళిరా మరి! వెళ్ళి రామ్మా!" అయ్యో! ఇదేమిటిలా అయింది ఆ లెక్కకొస్తే నా కోడలు అలా ఎప్పుడూ చేయలేదే? పనిమనిషి రాని రోజు కూడా నన్ను అంట్లు తోమనీ లేదే? వంట చేయడం కూడా నాకు శ్రమని పొయ్యి దగ్గరకు రానీడం లేదే? ఫించ నంతా పేకాటలో ఆర్పేసే ఆయనగారిని ఓ దోవకు తీసుకువచ్చింది వాడు స్నేహి తులకనీ సినిమాలకనీ, సిగరెట్లకనీ చేసే పిచ్చి ఖర్చులు తగ్గించేసింది. మార్కెట్టుకి ఆ ఆఫీసు ప్యూనుని పంపకుండా తనే పోయి అన్నీ తీసుకొస్తోంది ఆయనకూ, నాకూ వేళకు భోజనం, మందూ అన్నీ అమరుస్తోంది చుట్టు ప్రక్కలాళ్ళందరికీ అప్పు లిస్తోన్నాననీ నాకు డబ్బు అంద కుండా చేసింది ఇందులో దాని స్వార్థం ఏమీ లేదు ఇలాంటి పిల్లను గురించి ఎంత నీచంగా ఆలోచించానూ? ఎన్ని నిందలు వేశానూ? ఆ పిల్లంటే ఎందుకింత కక్ష ఏర్పడిపోయింది? కేవలం రాధమ్మ తన కోడలు గురించి చెప్పిన అబద్ధాలు వినడం వల్ల అయుంటుంది అవును రాధమ్మ తన కోడలునుంచి తనకి లభించని ఆదరణ. ఆప్యాయతలను కట్టుకథల రూపంలో అనుభవించి, అందరకూ ప్రచారం చేస్తోంటే నేను నా కోడలిని ఆ కథల్లోని కోడలితో పోల్చి చూసుకొని పిచ్చి పిచ్చి ఆలోచనలతో సతమతమవుతున్నాను

"అత్తయ్యా! భోజనానికి ఇంకా రాలే దేమిటి? పెందలాడే భోజనం చేసేయమని చెప్పానుగదా! ఈ వయసులో కూడా వేళకు తినకపోతే ఎలా? గట్టిగా చెప్తే నేమో నేను మీకు చెడ్డదాన్నయిపోతాను"

"పిల్లా ఈ ముసల్దంటే ఎందుకే ఇంత ఆపేక్ష! నువ్వే ఇంటి దీపానివి తల్లీ! అప్పు డప్పుడు నీ కాంతి భరించలేక ఏమేమో అనుకుంటూంటాను పాపిష్ఠిదాన్ని. నీ మనసుకూడా నొప్పిస్తుంటాను నన్ను క్షమిస్తావామ్మా?..." •